క్లుప్తంగా

మొహర్రం వేడుకలు ప్రారంభం



శిరివెళ్లలో కొలువైన పీర్లు

శిరివెళ్ల: మండలంలో మొహర్రం పూజలు ప్రారంభమయ్యాయి. అన్ని గ్రామాల పీర్ల చావిళ్లలో పీర్లను కొలువుదీర్చారు. మండల కేంద్రం శిరివెళ్ల, యర్రగుంట్లలో 5 చోట్ల, జీనేపల్లె, వనికినిదిన్నె, గోవిందపల్లె, బోయలకుంట్ల, మహదేవపురంలో పీర్లను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీన చిన్న సరిగెత్తు, 15న మధ్య సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు నిర్వహిస్తారు. 17వ తేదీన నిమజ్జనంతో పూజలు ముగుస్తాయి.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి, 1214 మెమోను వెంటనే రద్దు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలవెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఈనెల 15న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రసూల్, మాబాషా, రాముడు, తిమ్మయ్య పాల్గొన్నారు.

నాణ్యతలేని ఎరువులు విక్రయించొద్దు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ

రుద్రవరం: నాణ్యత లేని ఎరువులు విక్రయించరాదని, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. శుక్రవారం మండంలోని ఆలమూరు గ్రామంలోని మదీన ఎరువులు, పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు,పురుగు మందులు కొనుగోలు చేసే రైతులు దుకాణాదారుల నుంచి రసీదులు తప్పనిసరిగా పొందాలని చెప్పారు.ఈ సందర్భంగా ఎరువుల బస్తాలు, పురుగు మందుల నిల్వలను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏఈఓ రాజు ఉన్నారు.


లాల్‌స్వామికి ప్రత్యేక పూజలు



లాల్‌స్వామికి పూల బాసికాన్ని సమర్పిస్తున్న భక్తులు

చాగలమర్రి: మొహర్రం వేడుకల్లో భాగంగా స్థానిక చిన్నమాకానం చావిడిలో కొలువుదీరిన లాల్‌స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పలువురు భక్తులు పూల బాసికం, పాగలు తదితర సమర్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు పూజలు సాగుతాయని కమిటీ అధ్యక్షుడు ముల్లా జిలాన్‌బాషా, ఉపాధ్యక్షుడు ముల్లా షబ్బీర్ అహమ్మద్ తెలిపారు.

రేపు మంత్రులకు ఆత్మీయ సన్మానం



మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బలిజ సంఘీయుల ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రులకు ఆత్మీయ సన్మానం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు వెదుర్ల రామచంద్రారావు, డాక్టర్ రవికృష్ణ, ఏవీఆర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభయ్యే కార్యక్రమానికి మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్, సి.రామచంద్రయ్య, తిరుపతి శాసన సభ్యుడు ఆరణి శ్రీనివాసులు హాజరవుతారని చెప్పారు. రాజారాం, సోమేసుల నాగరాజు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

నంద్యాల(న్యూటౌన్): హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ రామకృష్ణ వివేకానంద ఆడిటోరియంలో హెల్మెట్లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతలో తీసుకోవాల్సిన విషయాలను వివరించారు. మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఎక్కువగా టూ వీలర్ ప్రమాదాల్లో ప్రాణనష్టం జరుగుతోందన్నారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు.



చిత్రేనిపల్లె వద్ద ట్రాక్టర్‌తో బురద సేద్యం చేస్తున్న దృశ్యం



నాట్లు వేసేందుకు సిద్ధంగానున్న మడులు

వరి నాటుకు సిద్ధం

- జోరుగా బురద సేద్యాలు
- ఏపుగా పెరిగిన వరి నారు



ముకుందాపురం వద్ద ఏపుగా పెరిగిన వరి నారు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, హరినగరం, సుగాలి తండా తదితర గ్రామాల పరిధిలోని రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. కొద్ది రోజులుగా ట్రాక్టర్లతో జోరుగా బురద సేద్యాలు చేయిస్తున్నారు. ఇప్పటికే నాటుకు అవసరమైన నారు ఏపుగా పెరిగింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు కాస్త ముందు మంచి వర్షాలు కురిశాయి. దీంతో భూగర్భ జలాలు పైకి రావడంతో బోర్ల నుంచి ఆశించిన స్థాయిలో నీరు అందుతుండటంతో ఆయా గ్రామాల రైతులు వరినారు పోసుకున్నారు. అలాగే పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లగా.. అరకొరగా కురిసిన వర్షానికి జీలుగ కర్రలు ఏపుగా పెరిగాయి. నారు చేతికి రావడంతో నాటేందుకు పొలాల్లో బురద సేద్యాలు చేయిస్తున్నారు. గట్టు వేసుకోవడంలో భాగంగా ఎదుల కాడీలతో పొలాన్ని చదును చేయడం వంటి పనులన్నీ పూర్తి చేసి నారు నాటే పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలో దాదాపు 250 హెక్టార్లలో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ఉయ్యాలవాడ: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఆ శాఖ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో రైతు గాండ్ల సుధాకర్ సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట, ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవడంతో ఉపాధిలో కూలీల సంఖ్య తగ్గిందన్నారు. తమ పరిధిలోని కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, చాగలమర్రి, ఆళ్లగడ్డ, రుద్రవరం, కొలిమిగుండ్ల సంజామల మండలాల్లో 384 మంది రైతులు 760 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా ఎంపిక చేశామన్నారు. జామ, మామిడి, మునగ, సపోటా, నిమ్మ, 16 రకాల పండ్ల తోటలు సాగు చేసేందుకు 400 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. కూలీల సంఖ్య పెంచేందుకు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు పనులపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.



పెద్దయమ్మనూరులో కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీడీ సాంబశివరావు

16న మాన్యం కౌలుకు వేలం

సాక్షి ఎఫెక్ట్

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం గ్రామంలో వెలిసిన శ్రీ వినాయక, జనార్దనస్వామి, రామ లింగేశ్వర స్వామి ఆలయ భూములు ఒక్క ఏడాది కౌలు సాగు కోసం ఈ నెల 16వ తేదీన వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రుడు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11న 'ఆ భూములు.. అంతేనా?' అనే శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు ఆలయ భూముల వేలం పాట నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆలయానికి సంబంధించి భూముల వివరాలు తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు.

పీఎంఎంవీవై పథకాన్ని వినియోగించుకోండి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ దస్తగిరమ్మ

నంద్యాల(అర్బన్): ప్రధాన మంత్రి మాతృవందన యోజన పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నజీర కోరారు. పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం గర్భిణులకు పీఎంఎంవీవై పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మహిళలతో నిర్వహించిన ర్యాలీలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణిగా ఉన్న సమయంలో స్థానిక ఆరోగ్య కేంద్రం నందు మహిళలు పేరు నమోదు చేయించుకుంటే రూ.3వేలు, జనన నమోదు సమయంలో రూ.2వేలు, మొత్తం రూ.5వేలు రెండు విడతల్లో ఆధార్‌తో అనుసంధానించిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6వేలు ఒకే విడతలో జమ అవుతాయని చెప్పారు. డాక్టర్ మహమ్మద్ ఫిరోజ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పేద గర్భిణులకు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం వరం లాంటిదని ఐసీడీఎస్ సూపర్ వైజర్ దస్తగిరమ్మ అన్నారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంపై స్థానిక గోకుల కృష్ణ దేవాలయ ఆవరణలో శుక్రవారం గర్భిణులకు అవగాహన కల్పించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు లీగల్‌సెల్ భరోసా

నంద్యాల(వ్యవసాయం): కూటమి నెల రోజుల పాలనలో జరుగుతున్న దాడులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర సభ్యుడు పెద్ది శ్రీనివాసులు పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, విజయశేఖర్ భరోసానిచ్చారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కార్యాలయంలో లీగల్‌సెల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. దాడులకు తెగబడడం మానుకుని హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసాపై దాడి చేసి, అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు ఇసుక మాఫియా, భూ కబ్జాలు, ఇళ్ల స్థలాల ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో బాలికపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు అధైర్య పడకుండా పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సభ్యులు తిమ్మారెడ్డి, ముక్కెరకృష్ణారెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, అల్లాబకాష్, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, ఓబులరెడ్డి, వనిపెంట కృష్ణారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు

కొలువుదీరిన పీర్లు

ఆళ్లగడ్డ: మొహర్రం వేడుకల్లో భాగంగా నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పీర్ల చావిళ్లలో పీర్లు కొలువుదీరాయి. కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసికట్టుగా నిర్వహించుకునే వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోనున్న పీర్ల చావిడిలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆళ్లగడ్డలో కొలువైన పీర్లు

తోపుడు బండ్లు, ఆటో కార్మికులను ఆదుకోండి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తోపుడు బండ్లు, ఆటో కార్మికుల కడుపు కొట్టొద్దని, వారిని ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌ఎం రజియా సుల్తానాకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులను నమ్ముకొని చాలా మంది ఆటో కార్మికులు, తోపుడుబండ్ల నిర్వాహకులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్టీసీ ఆదాయం కోసం ప్రయాణికులను ఆకట్టుకోవడానికి కొత్త బస్సులను వేయాలని, ఇలా చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడానికి ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు వేయడం సరికాదన్నారు. ఆర్‌ఎం స్పందించి చిరు వ్యాపారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హరి, యూనిస్, రసీదు, మదార్‌వలి, హుసేన్‌బాషా పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు పట్టణంలో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు లోనై నష్టపోతున్నారన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా మారిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సురేష్, సుంకన్న, సురేంద్ర, రమణ, రాఘవ, అశోక్‌కుమార్, పెద్దహుసేని, శివ, రమణ, గోవిందు పాల్గొన్నారు.

జలాశయాలను బాగు చేయించండి

నంద్యాల(వ్యవసాయం): అలగనూరు రిజర్వాయర్ కుంగిపోయిందని, నీరు నిల్వ ఉండటం లేదు, గోరుకల్లు రిజర్వాయర్ కూడా కుంగిపోవడంతో పంటలకు సరిగా నీరందడం లేదని, వెంటనే జలాశయాలను బాగు చేయించాలని బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం తూము శివారెడ్డి, ముక్తియార్‌బాషా..జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు సారె సమర్పణ



వాసవీ మాతకు సారె సమర్పిస్తున్న దృశ్యం



కాళికాంబ దేవికి సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ, శ్రీకాళికాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరీ, రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయాల్లో శుక్రవారం ఆషాడమాసాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పుట్టింటి పట్టు చీర, సారె సమర్పించారు. జగజ్జననీ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేపట్టి పట్టువస్త్రాలతో అలంకరించారు. సామూహిక కుంకుమార్చన, రాహుకాల పూజలు జరిపించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మేలతాళాలతో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం బల్లాని రమేష్ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పుట్టింటి పట్టుచీర సమర్పించారు. మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో వాసవీమాత, వింధ్యావాహిని అమ్మవారికి వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో చీర, సారె సమర్పించారు. రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ యాడికి శ్రీదేవి ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక లలితా సహస్రనామార్చన జరిపించారు. అనంతరం మహిళలు సామూహికంగా గోరింటాకు పెట్టుకున్నారు.



జగజ్జననీ మాతకు సారె తీసుకెళ్తున్న భక్తులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఉయ్యాలవాడ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలను కోరారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా గోవిందపల్లె, మాయలూరు, అల్లూరు, ఉయ్యాలవాడ, ఇంజేడు తదితర గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మురుగు కాలువలను శుభ్రం చేయడం, దోమలు వృద్ధి చెందకుండా కాలువల్లో వేస్ట్ ఆయిల్ చల్లించే కార్యక్రమాలు చేపట్టారు.

రుద్రవరం: ఆర్.నాగులవరంలో శుక్రవారం పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచు గంధం సావిత్రమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి హరిబాబు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రత పనులు చేయించారు. మురుగు గుంతల్లో దోమల వ్యాపించకుండా బ్లీచింగ్ పౌడర్, వేస్టు ఆయిల్ వంటివి చల్లించారు. అలాగే రక్షిత మంచి నీటి ట్యాంకు వద్ద నీరు నిల్వ ఉంటుండటంతో మట్టి తోలించి చదును చేయించారు. పనులన్నింటినీ ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ పరిశీలించారు.

దోమతెరల వాడండి..

వర్షాకాలం కావడంతో దోమల బెడద తీవ్రమైందని, వాటి నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరల వాడాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని నర్సాపురం పీహెచ్‌సీ వైద్య బృందం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, శుభ్రత పాటించాలని సూచించారు. హెచ్‌ఎం రాజ్యలక్ష్మి,ఉపాధ్యాయులు, ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గోస్పాడు: డ్రైడే-ఫ్రైడే పాటించి దోమల వృద్ధిని అరికట్టాలని ఎంపీడీఓ నాగ అనసూయ, వైద్యాధికారి డాక్టర గోపాల్ సూచించారు. మండల కేంద్రం గోస్పాడులో జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షా కాలంలో మురుగు నీటి నిల్వలు లేకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇళ్లలోని నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదన్నారు.



నర్సాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డ్రైడే.. ఫ్రైడేను పటిష్టంగా అమలు చేయాలి



అమృత్, ఎస్టీపీ పనులను పరిశీలిస్తున్న పబ్లిక్‌హెల్త్ ఈఈ చంద్రమోహన్‌రావు

నంద్యాల(సిటీ): డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని 36వ వార్డులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వీయ పరిశుభ్రతే కాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను స్థానికులకు వివరించారు.

అమృత్2.0, ఎస్టీపీ పనుల పరిశీలన..

నంద్యాల పట్టణానికి నీటిని అందించేందుకు ఏర్పాటు చేస్తున్న అమృత్ 2.0 ప్రాజెక్టుకు సంబంధించిన పనులను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రమోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు అమృత్ 2.0, ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ద్వారా నీటి శుద్ధీకరణ నిర్మాణ పనుల పురోగతిపై ఆరాతీశారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, డీఈఈలు, ఏఈలు ఉన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి..

వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 10, 12వ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పథకాల అమలులో జాప్యం చూపరాదన్నారు.

కౌలు కార్డుపై అవగాహన

దొర్నిపాడు: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో కౌలు గుర్తింపు కార్డు జారీపై రైతులకు మండల వ్యవసాయాధికారి సునీత శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పొలం లేని, ఇతర రైతుల పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవారు మాత్రమే కార్డులు పొందేందుకు అర్హులన్నారు. పొలం పాసుపుస్తకం, ఆధార్‌కార్డును సంబంధిత వీఆర్‌కు అందజేస్తే పరిశీలించి కార్డు అందజేస్తారని చెప్పారు.

నంద్యాల(అర్బన్): భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే రైతులకు అందించే పంట సాగుదారు హక్కు పత్రాల ద్వారా ప్రభుత్వ పథకాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. హక్కు పత్రాలు జారీ చేయడం ద్వారా భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. మండలంలోని మిట్నాల, పుసులూరు గ్రామాల్లో శుక్రవారం పంట సాగుదారు హక్కు పత్రాల జారీపై కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుసులూరులో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు.



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోండి

శిరివెళ్ల: కౌలు గుర్తుంపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో కార్డుల ఉపయోగాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు అర్హతల గల ప్రతి కౌలు రైతుకు గుర్తుంపు కార్డులు అందజేస్తామన్నారు. కార్డుల కోసం భూ యజమాని పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుతో వీఆర్వోను సంప్రదించాలని సూచించారు. ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, జీపీఎఫ్ లోన్లు, సరెండర్ లీవ్‌లు తక్షణమే చెల్లించాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజకుమారిని కలిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఉద్యోగులపై దాడులు ఆపాలన్నారు. తాలూకా అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి హుసేన్‌రెడ్డి, నర్సారెడ్డి, నాగరాజు, శేఖర్, నారాయణరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

దొర్నిపాడు: కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సీహెచ్‌ఓ విమలమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు. ఆరోగ్య సమస్యలుంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆకుకూరలు తీసుకుంటే విటమిన్ లోపం తలెత్తదన్నారు. అనంతరం మహిళా పోలీస్ ఉశేనమ్మ గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయిని జయప్రదమ్మ, ఏఎన్‌ఎం మాణిక్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మార్తమ్మ, సుభాషిణి, ఆశా వర్కర్లు విజయలక్ష్మి, లక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ విమలమ్మ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నంద్యాల(అర్బన్): విద్యుత్ తీగల సవరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా డి1, డి2, డి3 సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సంబంధిత ఏఈలు నాగరాజు, రామయ్య, రవికుమార్ శుక్రవారం తెలిపారు. డి1 పరిధిలో ఉదయం 9 నుంచి 3గంటల వరకు, డి2, డి3 పరిధిలో 9 నుంచి 12గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.